

**శ్రీమందిరం ఆదాయం లెక్కింపు**


భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,29,951లు, బంగారం 120 మిల్లీగ్రాములు, వెండి 12గ్రాముల 500 గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



**తాగుబోతు మాస్టారు మాకొద్దు**

ఎల్లప్పుడూ తప్పతాగి స్కూల్‌కి వచ్చి విద్యార్థులను ఇబ్బంది పెడుతున్న తాగుబోతు మాస్టారు తమకు వద్దని పాఠశాల విద్యార్థులు జిల్లా విద్యాశాఖ అధికారి బసంత కుమార్ నాయక్‌తో మొరపెట్టుకున్నారు.

- 8లో.




## న్యూస్‌రీల్

### నిబంధనలు పాటించాలి



రాజకీయ నాయకులతో మాట్లాడుతున్న కలెక్టర్ కమలోచన్ మిశ్ర

కొరాపుట్: సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని నబరంగ్‌పూర్ కలెక్టర్ డాక్టర్ కమలోచన్ మిశ్ర విజ్ఞప్తి చేశారు. సోమవారం తన కార్యాలయంలో వివిధ పార్టీల ముఖ్య ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కోడ్ అమల్లోకి వచ్చినందున పార్టీలు ఏర్పాటు చేసిన బ్యానర్లు, హోర్డింగ్‌లు తొలగించాలన్నారు. గోడలపై ఉన్న రాతలపై రంగులు వేయాలన్నారు. కేంద్ర ఎన్నికల కమిషన్ నిబంధనల ఫైల్‌ని పార్టీల ప్రతినిధులకు అందజేశారు. కవ్వింపు చర్యలకు దిగకుండా శాంతి భద్రతల పరిరక్షణ కోసం తమ తమ నాయకులకు ఈ నిబంధనలు వివరించాలని పేర్కొన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు జగదీష్ బిసాయి, బీజేడీ పట్టణ శాఖ అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ రథ్, కాంగ్రెస్ అధికార ప్రతినిధి ప్రతిప్ సాహు, ఏడీఎంలు మహేశ్వర్ చంద్ర నాయక్, నవీన్ చంద్ర నాయక్‌లు పాల్గొన్నారు

### డీజిల్ దొంగతనం కేసులో ముగ్గురు అరెస్టు



అరెస్టైన నిందితులు

రాయగడ: రోడ్డుపై నిలిపి ఉన్నటువంటి వాహనాల నుంచి డీజిల్‌ను దొంగలిస్తున్న ముగ్గురు నిందితులను జిల్లాలోని అంబోదళ పోలీసులు సోమవారం పట్టుకొని, వారి వద్ద నుంచి 327 లీటర్ల డీజిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించారు. ఈ కేసులో అరెస్టైనవారిలో మునిగుడ పరిధి ఛెలియానాలో గ్రామానికి చెందిన ముండు మహానందియా, అంబొదల గ్రామానికి చెందిన బృందావన్ సునా, అజయ్ సునాలు ఉన్నట్లు తెలియజేశారు. గత కొద్దికాలంగా అంబొదల ప్రాంతంలో రోడ్డు పక్కన నిలుపుతున్న వాహనాల నుంచి డీజిల్ చోరీకి గురవుతున్నట్లు పోలీసుల దృష్టిలోకి వచ్చింది. ఈ క్రమంలో నిఘా పెట్టిన పోలీసులు సోమవారం ఒక వాహనం నుంచి డీజిల్ దొంగతనం చేస్తుండగా ముండు మహానందియాను పట్టుకుని విచారించారు. దీంతో అతను దొంగిలించి తెచ్చిన డీజిల్‌ను తక్కువ ధరలో బృందావన్, అజయ్ సునాలు ఖరీదు చేస్తున్నట్లు వెల్లడైంది. నిందితుల నుంచి డీజిల్‌తో సహా దొంగతనానికి వినియోగించే కొన్ని పరకరాలను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

### గజపతిలో 573 బూత్‌లు ఏర్పాటు

● కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్




మాట్లాడుతున్న కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్

పర్లాకిమిడి: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి గజపతి జిల్లాలో మొత్తం 573 బూత్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ తెలియజేశారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన దృష్ట్యా కలెక్టర్ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని సోమవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలు శాంతియుతంగా, స్వేచ్ఛగా జరిగేందుకు ఒక టీమ్ ఏర్పాటు చేశారు. మొత్తం మోహనా (ఎస్టీ) సెగ్మెంట్‌లో 263 బూత్‌లు, పర్లాకిమిడిలో 273 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. దీంతో పాటు వయోవృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. జిల్లాలో మొత్తం 4,59,229 ఓటర్లు ఉండగా, వాటిలో 2,24,405 మంది పురుషులు, 2,34,799 మహిళా ఓటర్లు ఉన్నారు. ఇతరులు 24 మంది, 2,540 మంది వయోవృద్ధులు, 10,376 మంది దివ్యాంగులు ఉన్నట్లు తెలియజేశారు. సమావేశంలో జిల్లా ఎస్పీ స్వాతి ఎస్.కుమార్, అదనపు కలెక్టర్ బీరేంద్ర కుమార్‌దాస్, అదనపు జిల్లా మాజిస్ట్రేట్ రాజేంద్ర మింజ్, డీఆర్‌డీఏ సీడీఎం గుణనిధినాయక్, సబ్‌కలెక్టర్ అనుప్ పండా, డిప్యూటీ కలెక్టర్ కమలకాంత పండా పాల్గొన్నారు.

# గెలుపు గుర్రాల.. వేటలో..!



- అభ్యర్థుల ఖరారులో అధిష్టానాల కసరత్తు
- సీఎం నవీన్ నివాస్‌లో బీజేడీ కీలక సమావేశం
- ఢిల్లీకి మన్మోహన్ సామల్ పయనం

భువనేశ్వర్: భారత ఎన్నికల సంఘం సార్వత్రిక ఎన్నికల తేదీలు వెల్లడించడంతో రాష్ట్రంలో ప్రధాన రాజకీయ పక్షాలు బరిలోకి దింపనున్న అభ్యర్థుల ఎంపిక, ఖరారు కసరత్తు ప్రారంభించాయి. ప్రధానంగా అధికార బిజూ జనతా దళ్, ప్రధాన విపక్షం భారతీయ జనతా పార్టీ ఈ ప్రక్రియలో తలమునకలై ఉన్నాయి. నవీన్ నివాస్ ఆవరణం సోమవారం ఉదయం నుంచి కళకళలాడుతుంది. పలు జిల్లాల నుంచి ప్రాంతీయ నాయకుల రాకలు ఊపందుకున్నాయి. ఈ పంథాలో తొలుత పూరీ జిల్లా నుంచి నాయకులు నవీన్ నివాస్‌కు విచ్చేసినట్లు తెలుస్తోంది. జిల్లావారీగా గెలుపు గుర్రాల గుర్తింపు కోసం అధినేత ప్రత్యక్ష సమీక్ష కొనసాగుతున్నట్లు స్పష్టమవుతోంది. పూరీ జిల్లాకు చెందిన బిజూ జనతా దళ్ ఎమ్మెల్యేలు, లోక్ సభ సభ్యులు, రాజ్యసభ సభ్యులు, అరుణ్ సాహు, రుద్ర మహారథి, సంజయ్ దాస్ బర్మ, ఉమాకాంత సామంతరాయ్, సత్యనారాయణ ప్రధాన్ నవీన్ నివాస్‌కు చేరుకున్నారు. వీరితో పాటు బిజూ జనతా దళ్ సంస్థాగత కార్యదర్శి ప్రణబ్ ప్రకాష్ దాస్, పూరీ జిల్లా పరిశీలకుడు, మంత్రి రణేంద్ర ప్రతాప్ స్వంయి ఉన్నారు.

**అధిష్టానం ఆమోదం కోసం**

మరోవైపు భారతీయ జనతా పార్టీ త్వరలో జరగనున్న లోక్ సభ, శాసనసభ ఎన్నికల్లో పోటీకి ఖరారు చేసిన జాబితాతో ఆ పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మన్మోహన్ సామల్ ఢిల్లీకి పయనమయ్యారు. ఆయనతో రాష్ట్ర బీజేపీ ఎన్నికల ఇన్‌చార్జి విజయ్ పాల్ సింగ్ తోమర్, కో-ఇన్‌చార్జి లతా ఉసెండి, సంస్థాగత కార్యదర్శి మానస్ మహంతి బయల్దేరారు. పార్టీ అధిష్టానం, ఎన్నికల యంత్రాంగం ఆమోదం కోసం ఆయన వెళ్లినట్లు బీజేపీ శిబిరం సమాచారం. రాష్ట్ర ఎన్నికల కమిటీ రూపొందించిన అభ్యర్థుల జాబితాపై కేంద్ర నేతలతో చర్చిస్తారని ఈ వర్గాల సమాచారం.

**మరోసారి పొత్తు చర్చలు..?**

ఇదిలా ఉండగా రాష్ట్రంలో బిజూ జనతా దళ్, బీజేపీ పొత్తు విషయం చివరిసారిగా మరోసారి ప్రస్తావనకు వచ్చే అవకాశంపై చర్చ సాగుతోంది. రాష్ట్రంలో బీజేడీతో పొత్తు కోసం బీజేపీ కేంద్ర నాయకత్వం ఉవ్విళూరుతోంది. ఈ సమీకరణంతో లోక్‌సభలో ఏక ఛత్రాధిపత్యం చేజిక్కించుకునే యోచనతో బీజేపీ అధిష్టానం పావులు కదుపుతుండగా, ఇదే అదునుగా రాష్ట్రంలో ఏక ఛత్రాధిపత్యం కోసం బీజేపీతో పొత్తు సరైనదేనని బీజేడీ అధిష్టానం చిట్ట చివరి క్షణం పరిణామాల కోసం అత్యంత ఆశతో నిరీక్షిస్తోంది. ఉభయ పార్టీల అధిష్టానం అభిప్రాయాలతో బీజేపీ రాష్ట్ర శాఖ ఏమాత్రం ఏకీభవించకుండా ఇప్పటివరకు తన వైఖరిని పట్టు వీడకుండా నిలకడ కొనసాగించింది. ఈ రెండు పార్టీల మధ్య తమకు అనుకూలిస్తుందని మరోవైపు రాష్ట్ర కాంగ్రెసు పొత్తు తుది నిర్ణయం కోసం తొంగి చూస్తోంది. గెలుపు, ఓటమి, ప్రభుత్వం ఏర్పాటు వంటి అంశాలు పక్కకు నెట్టి రాష్ట్ర శాసనసభలో ప్రధాన విపక్షం హోదా సునిశ్చయంగా గణాంకాలు కట్టుకుని కొండంత ఆశతో ఎదురు చూస్తుంది. బీజేడీ, బీజేపీ పొత్తుతో రాష్ట్రంలో కాంగ్రెసు రాజకీయంగా ద్వితీయ స్థానంతో క్రమంగా పూర్వ వైభవాన్ని కూడ గట్టుకోవడం తథ్యమని కాంగ్రెసు అభిమానులు, అనుచరులు, ఇతరేతర సానుకూల వర్గాలు భావిస్తున్నాయి.

### శాంతియుత వాతావరణంలో ఎన్నికలు

● గంజాం కలెక్టర్ దివ్యజ్యోతి పరిడా



సమావేశంలో మాట్లాడుతూన్న కలెక్టర్ దివ్యజ్యోతి పరిడా

బరంపురం: గంజాం జిల్లాలో శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరగాలని కలెక్టర్ దివ్యజ్యోతి పరిడా ఆకాంక్షించారు. జిల్లా కేంద్రం ఛత్రపూర్‌లోని కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో అధికారులతో సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు తమ ఓటుహక్కుని ప్రశాంత వాతావరణంలో వినియోగించుకునే విధంగా జిల్లా పాలన యంత్రాంగం అన్ని చర్యలు పూర్తి చేసిందన్నారు. రాష్ట్రంలోనే అతి పెద్దదైన గంజాం జిల్లాలో బరంపురం, అస్కా రెండు లోక్‌సభ స్థానాలు, 13 శాసనసభ స్థానాలు బరంపురం, అస్కా, బంజనగర్, దిగపండి, చికిటి, గోపాల్‌పూర్, సన్నోఖేముండి, ఛత్రపూర్, కల్లికోట్, పులసరా, కవిసూర్యనగర్, హింజిలికాట్, సురడా నియోజకవర్గాల్లో రెండు విడతల్లో ఎన్నికలు జరగనున్నట్లు వెల్లడించారు. పోలింగ్ కోసం 3,077 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలియజేశారు. వృద్ధులు, వికలాంగులకు ప్రత్యేక వాహనాల ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. సమావేశంలో బరంపురం సబ్ కలెక్టర్ దిగంత్ రౌత్‌రాయి, బంజనగర్ కలెక్టర్ లక్ష్మీ కాంత్ సెఠి తదితరులు పాల్గొన్నారు.

### ఎన్నికల నియమావళిపై సమావేశం



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో సార్వత్రిక ఎన్నికల నియమావళిని పాటించేందుకు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆదివారం సాయంత్రం పాలనాధికారి స్మృతి రంజన్ ప్రధాన్ సమావేశం నిర్వహించారు. అన్ని పార్టీలకు చెందిన నాయకులు ఎన్నికల నియమావళిని పాటించాలని, అందుకు అనుగుణంగా వాహనాలు, మైకులు ద్వారా ఎలా ప్రచారం చేయాలన్న దానిపై చర్చించారు. సమావేశంలో ఎస్పీ స్వాతి హెస్.కుమార్, అదనపు కలెక్టర్ బీరేంద్ర కుమార్ దాస్, అదనపు జిల్లా మేజిస్ట్రేట్ రాజేంద్ర మింజ్, సబ్ కలెక్టర్ అనుప్ పండా తదితరులు పాల్గొన్నారు.

## హుండీ ఆదాయం రూ.89.72 లక్షలు



హుండీని లెక్కిస్తున్న సేవా సభ్యులు

రాయగడ: ఆంధ్ర, ఒడిశా రాష్ట్ర ప్రజల ఆరాధ్య దైవంగా పూజలందుకుంటున్న మజ్జిగౌరి అమ్మవారి హుండీ లెక్కింపు కార్యక్రమం సోమవారం జరిగింది. మందిరం మేనేజింగ్ ట్రస్టీ రాయిసింగి బిడిక, ట్రస్ట్ సభ్యులు పి.వాసు, దేవేంద్ర బెహర, బాబు దొలాయి, మందిరం సూపరింటెండెంట్ బిజయానంద తదితరుల సమక్షంలో ఉదయం 9 గంటలకు హుండీలను తెరిచారు. మందిరం ప్రాంగణంలో 9 హుండీలను లెక్కించగా రూ.89,72,225లు ఆదాయం, అలాగే బంగారం రూపంలో 62 గ్రాములు, వెండి రూపంలో 2.300 కిలో గ్రాములు వచ్చినట్లు ఆలయ ట్రస్టీ బిడిక తెలియజేశారు. రాత్రి సుమారు 8 గంటల వరకు కొనసాగిన లెక్కింపు కార్యక్రమంలో స్థానిక శ్రీవేంకటేశ్వర మందిరం సేవా కమిటీ సభ్యులు, సత్యసాయి బాబా సేవా సమితి సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యార్థిని అనుమానాస్పద మృతి



వసతి గృహం వద్ద ధర్నా చేస్తున్న కుటుంబ సభ్యులు

మల్కన్‌గిరి: జిల్లాలోని మల్కన్‌గిరి సమితి ఎంవీ 7 గ్రామంలో ఉన్న గణేష్ వసతి గృహంలో 6వ తరగతి చదువుతున్న విద్యార్థిని అనుమానాస్పదంగా మృతి చెందింది. వివరాల్లోకి వెళ్తే.. ఎంవీ 130 గ్రామానికి చెందిన విశ్వజిత్ మండాల్ కుమార్తె ఎంవీ 7 గ్రామంలో ఉన్న గణేష్ వసతి గృహంలో చదువుతోంది. అయితే బాలికకు ఆదివారం సాయంత్రం ఆరోగ్యం బాగోలేదు అని వసతి గృహం సిబ్బంది మల్కన్‌గిరి ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ బాలిక ఆదివారం అర్ధరాత్రి మృతి చెందింది. బాలిక ఆరోగ్యంపై కుటుంబ సభ్యులకు హాస్టల్ సిబ్బంది సమాచారం అందజేశారు. అయితే ఆస్పత్రికి చేరుకున్న కుటుంబ సభ్యులు తమ బిడ్డను ఎవరో హత్య చేశారని అనుమానం వ్యక్తం చేశారు. బాలిక శరీరంపై గాయలను పోలిన మచ్చలు ఉండడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సోమవారం ఉదయం మల్కన్‌గిరి పోలీసులు ఆస్పత్రికి చేరుకొని మృతదేహన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పోస్టుమార్టంకు తరలించారు. పోస్టుమార్టం నివేదిక వస్తే ఎలా మృతి చెందింది అనేది తెలుస్తుందని. మరోపక్క కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా హాస్టల్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు ఆందోళన చేస్తున్నారు.



విద్యార్థిని మృతదేహం

## నిర్భయంగా ఓటు వేయండి

- అందరి సహకారంతో ప్రశాంత ఎన్నికలు
- ఖుర్దా కలెక్టర్ చంచల్ రాణా



మాట్లాడుతున్న కలెక్టర్ చంచల్ రాణా

భువనేశ్వర్: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో నిర్భయంగా ఓటు వేయాలని ఖుర్దా జిల్లా కలెక్టర్ చంచల్ రాణా పిలుపునిచ్చారు. స్థానిక కలెక్టరేట్ సద్భావన భవనంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అందరి సహకారం అవసరమని అభ్యర్థించారు. ఎన్నికల ప్రక్రియలో ప్రతి ఒక్కరూ నిష్పక్షపాతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఖుర్దా జిల్లాలో భువనేశ్వర్ పార్లమెంటరీ నియోజకవర్గం పరిధిలో జయదేవ్, భువనేశ్వర్ (మధ్య), భువనేశ్వర్ (ఉత్తర), ఏకామ్ర, జట్నీ, బెగునియా, ఖుర్దా, పూరీ పార్లమెంటరీ నియోజక వర్గానికి చెందిన చిలికా విధాన సభ నియోజక వర్గాలు ఉన్నట్లు పేర్కొన్నారు.

**ఆరో విడతలో పోలింగ్**

ఆరో విడతలో ఈ నియోజకవర్గాల్లో పోలింగ్ జరుగుతుందని వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 29వ తేదీన గెజెట్ జారీ అవుతుందన్నారు. మే 6వ తేదీతో నామినేషన్ దస్తావేజుల దాఖలు పూర్తవుతుందని వెల్లడించారు. మర్నాడు వీటిని పరిశీలించి 9వ తేదీ వరకు పోటీ ఉపసంహరణకు గడువు కల్పిస్తారని వివరించారు. మే 25వ తేదీన పోలింగ్ జరిగి, జూన్ 4వ తేదీన ఫలితాలు ప్రకటిస్తారు. ఈ క్రమంలో జూన్ 6వ తేదీ నాటికి సమగ్ర ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుదన్నారు.

**జిల్లాలో 18,65,455 మంది ఓటర్లు**

ఖుర్దా జిల్లాలో సమగ్రంగా 18,65,455 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 9,71,554 మంది పురుషులు, 8,93,341 మంది మహిళలు, 560 మంది ఇతరులు ఉన్నారు. ఈసారి 18 నుంచి 19 ఏళ్ల మధ్య యువ ఓటర్ల సంఖ్య గణనీయంగా పెరిగింది. గత 2019 నాటి ఎన్నికల సమయానికి ఈ వర్గం ఓటర్లు 25,039 మందికి పరిమితం కాగా, ఈసారి 35,308 మందికి పెరిగింది. గత ఎన్నికల్లో ఖుర్దా జిల్లాలో సమగ్రంగా 61.79 శాతం పోలింగ్ నమోదు అయింది.

**1,907 పోలింగ్ కేంద్రాలు**

ఖుర్దా జిల్లావ్యాప్తంగా 2 పార్లమెంటరీ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 8 శాసనసభ నియోజకవర్గాలు ఉన్నాయి. వీటిలో జయదేవ్ నియోజకవర్గం షెడ్యూల్డ్ కులానికి కేటాయించారు. బెగునియా నియోజకవర్గం గ్రామీణ ప్రాంతంలో అత్యధికంగా 239 పోలింగ్ కేంద్రాలు, పట్టణ ప్రాంతాల్లో అత్యధికంగా భువనేశ్వర్ (ఉత్తర) నియోజకవర్గంలో 220 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా పట్టణ, నగర ప్రాంతాల్లో 720, గ్రామీణ ప్రాంతాల్లో 1,187 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఈ లెక్కన జిల్లావ్యాప్తంగా సమగ్రంగా 1,907 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు.

**ఆదర్శ పోలింగ్ బూత్‌లు**

జిల్లాలో 20 శాతం ఆదర్శ పోలింగ్ బూత్‌లు ఏర్పాటవుతాయి. 60 శాతం పోలింగ్ బూత్‌ల్లో వెబ్ కాస్టింగ్ వ్యవస్థ ఏర్పాటవుతుంది. 524 పింక్ బూత్‌లు, 139 మహిళలు నిర్వహించే బూత్‌లు, 30 ఏళ్ల లోపు యువత ఆధ్వర్యంలో 30 బూత్‌లు, దివ్యాంగుల పర్యవేక్షణలో 8 ఆదర్శ పోలింగు బూత్‌లు ఈసారి ఏర్పాటు చేస్తారు.

**ఇంటి నుంచే ఓటు**

85 ఏళ్లు లేదా పైబడిన వయో వృద్ధులు, దివ్యాంగులు ఇంటి వద్ద నుంచే ఓటు వేసే సౌలభ్యం పొందుతారని కలెక్టర్ తెలిపారు. ఈ మేరకు అధికార యంత్రాంగం అనుబంధ ఏర్పాట్లు చేస్తోంది. అలాగే వేసవి తాపం దృష్ట్యా పోలింగ్ కేంద్రాల ప్రాంగణాల్లో వడ దెబ్బ నివారణకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తారు. ప్రధానంగా ఛాయా ప్రాంతం, తాగునీరు, విరామ ప్రాంగణాలు వంటివి అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.

**13,782 మంది పోలింగ్ సిబ్బంది**

ఈసారి ఎన్నికల ప్రక్రియ నిర్వహణ కోసం 13,782 మంది సిబ్బందిని నియమించారు. వీరికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమం కొనసాగుతుంది. భువనేశ్వర్ పార్లమెంటరీ నియోజకవర్గం పరిధిలో బలియంత మంజరీ దేవీ నర్సింగ్ కళాశాల, భువనేశ్వర్ ఐటీఈఆర్ కళాశాల, జట్నీ నైజర్, బెగునియా పిచ్చుకులి ఒడిశా ఆదర్శ విద్యాలయ్, ఖుర్దా ప్రాణనాథ్ కళాశాల, పూరీ పార్లమెంటరీ నియోజకవర్గం పరిధిలో బలుగాంవ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణాల్లో పోలింగ్ సిబ్బందికి శిక్షణ నిర్వహిస్తున్నారు.

**కంట్రోల్ రూమ్**

ఎన్నికల ప్రక్రియ శాంతియుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు ప్రత్యేక కంట్రోల్ రూమ్ ప్రారంభించారు. సంప్రదింపుల ఫోను నంబర్లు 06755 - 1950, 06755 - 220937.

## భారీగా గంజాయి పట్టివేత



బరంపురం: అరెస్టైన వ్యక్తిని చూపిస్తున్న పోలీసులు

బరంపురం: గంజాం పోలీసు జిల్లా పరిధి 59వ నంబర్ జాతీయ రహదారిలో కారులో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని హింజిలికాట్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఐఐసీ అధికారి కౌసిక్ మజ్జి తెలిపిన వివరాల మేరకు.. హింజిలికాట్ పోలీసుస్టేషన్ పరిధి 59వ నంబర్ జాతీయ రహదారి మీదుగా బరంపురం నగరానికి అక్రమంగా గంజాయి తరలిస్తున్నట్లు పోలీసులకు ముందస్తు సమాచారం వచ్చింది. దీంతో డెంగపదర జంక్షన్‌లో తనిఖీలు చేపట్టారు. దీనిలో భాగంగా ఒక ఆటోలో తనిఖీలు చేపట్టగా 25 కిలోల గంజాయి పట్టుబడింది. దీంతో ఆటోని సీజ్ చేసి డ్రైవర్‌ను అరెస్టు చేశారు. అరెస్టైన ఆటో డ్రైవర్ గజపతి జిల్లా అడవా గ్రామనికి చెందిన రాధాకృష్ణ దాస్‌గా పోలీసులు వెల్లడించారు.

రాయగడ: కారులో అక్రమంగా గంజాయిని తరలిస్తున్న ఒకరిని గుణుపూర్ పోలీసులు ఆదివారం సాయంత్రం అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. అరెస్టైన వ్యక్తి కేరళ రాష్ట్రానికి చెందిన రెబిన్ రెజీ (35)గా గుర్తించారు. అతని నుంచి 210 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలియజేశారు. వివరాల్లోకి వెళ్తే.. జిల్లాలోని గుణుపూర్ పోలీసులు ఎప్పటిలాగే వాహన తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో విక్రమపురం నుంచి ఒక కారు పర్లాకిమిడి వైపు వెళ్తుండగా తనిఖీల కోసం ఆపారు. దీంతో కారులో 210 కిలోల గంజాయి పట్టుబడింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష**

గంజాయి అక్రమ రవాణా కేసులో నిందితుడికి పదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.లక్ష జరిమానా విధిస్తూ జిల్లా జడ్జి సత్యనారాయణ సాడంగి సోమవారం తీర్పునిచ్చారు. ఈ కేసుకు సంబంధించి సాక్షులను, ఆధారాలను పరిశీలించిన మీదట ఈ మేరకు తీర్పునిచ్చారు. వివరాల్లోకి వెళ్తే.. గతేడాది మే 29వ తేదీన సదరు ఎక్సైజ్ శాఖ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో భాగంగా హర్యానా రాష్ట్రానికి చెందిన రహతక్ జిల్లా పరిధిలోని మకరాఖరి గ్రామానికి చెందిన దలసేర్ సింహ్ అనే వ్యక్తి 30.300 గ్రాముల గంజాయి రవాణా చేస్తుండగా పట్టుబడ్డాడు. దీనికి సంబంధించి అధికారులు అతనిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించారు. దీంతో కేసు విచారణకు రావడంతో అన్ని ఆధారాలను పరిశీలించి, సాక్షులను విచారించిన జిల్లా జడ్జి సాడంగి నిందితునికి ఈ మేరకు శిక్ష విధించి తీర్పును వెల్లడించారు. ఈ కేసుకు సంబంధించి ప్రభుత్వ న్యాయవాది బ్రజసుందర్ నాయక్ ప్రభుత్వం తరపున వాదించగా, నిందితుని తరుపు నుంచి న్యాయవాది సుశాంత్ ఖోసల వాదించారు.

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి సమీప అడవిలో సోమవారం మధ్యాహ్నం గంజాయిని ఆంధ్రాకు తరలించేందుకు సిద్ధం చేసినట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో కలిమెల పోలీసులు అడవి వద్ద పెట్రోలింగ్ నిర్వహించి తరలించేందుకు సిద్ధంగా ఉంచిన గంజాయి బస్తాలు స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. అరెస్టైనవారు చిత్రకొండ సమితికి చెందిన జగత్రయ్ ముదిలి(45), సోనా ముదిలి (43)గా నిర్ధారించారు. పట్టుబడిన గంజాయి విలువ 70 లక్షలు ఉంటుదని తెలిపారు. నిందితులను మంగళవారం కోర్టులో హాజరుపరుస్తామని ఐఐసీ చంద్రకాంత్ తండ వెల్లడించారు.



మల్కన్‌గిరి: గంజాయితో పట్టుబడిన నిందితులు



రాయగడ: గంజాయితో పట్టుబడిన నిందితుడు

## క్లుప్తంగా

### అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా 'చింతాడ'


చింతాడ సత్యనారాయణ

శ్రీకాకుళం పాత బస్టాండ్: రెండో అదనపు జిల్లా, సెషన్స్ కమ్ మహిళా కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా సీనియర్ లాయర్ చింతాడ సత్యనారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు విజయవాడ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆయనకు ఈ పదవి రావడంపై జిల్లా బార్ అసోసియేషన్‌లో పలువురు లాయర్లు హర్షం వ్యక్తం చేశారు.

### 'బార్'లో ఎన్నికల వేడి

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా న్యాయవాదుల బార్ అసోసియేషన్‌కు ఎన్నికలు జరగనున్నాయి. ఈ నెలలో ఎన్నికలు ఉంటాయని నోటిఫికేషన్ విడుదలైంది. 18, 19 తేదీల్లో నామినేషన్లు స్వీకరించనున్నారు. ఈ నెల 21న నామినేషన్ల పరిశీలన ఉంటుంది. 22న విత్‌డ్రాకు అవకాశమిచ్చారు. తుదిజాబితా 23న ప్రకటించి, 27న పోలింగ్ నిర్వహించనున్నారు. 27న కౌంటింగ్ నిర్వహించి విజేతలను ప్రకటిస్తారు.

### 'వీఎల్‌టీ సమస్యను పరిష్కరించాలి'

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్ చెల్లించడం ప్రధాన సమస్యగా మారిందని, వీఎల్‌టీల లాగిన్ అయ్యేలా చూడాలని జిల్లాలోని ఎల్‌టీపీలు అందరూ వెల్ఫేర్ అసోసియేషన్ లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్స్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాస్‌కుమార్, చైర్మన్ మురళీకృష్ణలను కోరారు. లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కేవన్ ఎస్‌వీ ప్రసాద్ (హారికా ప్రసాద్) అధ్యక్షతన హారికా కన్‌స్ట్రక్షన్స్ కార్యాలయంలో డబ్ల్యూఏఎల్‌టీపీ రాష్ట్ర అసోసియేషన్‌తో సోమవారం సమావేశం నిర్వహించారు. సమావేశానికి నగరంలోని ఎల్‌టీపీలందరూ హాజరై రాష్ట్ర అసోసియేషన్ ప్రతినిధుల దృష్టికి తమ సమస్యలను తీసుకువెళ్లారు. దానికి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌కుమార్ స్పందిస్తూ ఇది ప్రస్తుతం ప్రాసెస్‌లో ఉందని త్వరలోనే లాగిన్ అయ్యేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. టీడీఆర్ ఫేక్‌బాండ్లు, రెండు అసోసియేషన్ల సమస్యను ప్రస్తావించగా.. రాష్ట్ర ప్రతినిధులు స్పందిస్తూ రెండు అసోసియేషన్లతో చర్చించి త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

### 24న జిల్లాస్థాయి బలప్రదర్శన పోటీలు

సారవకోట: మండలంలోని వడ్డినవలస గ్రామంలో ఈ నెల 24న జిల్లాస్థాయి బలప్రదర్శన పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఇప్పిలి ఆంజనేయ ప్రసాద్ తెలిపారు. గ్రామంలో గల శ్రీ త్రినాథ స్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఇప్పిలి గణపతిరావు మాస్టారు జ్ఞాపకార్థం బంపరు, సంగిడి, విసురుగుండు, తీత సంగిడి పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వీటిలో విజేతలకు ప్రథమ, ద్వితీయ బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 23లోగా 9502382777 నంబర్‌కు ఫోన్ చేసి పేరు నమోదు చేసుకోవాలని సూచించారు.

### రక్తదానంతో గర్భిణికి ప్రాణదానం


రక్తదానం చేస్తున్న అవినాష్

కాశీబుగ్గ: ప్రసూతి సమయంలో రక్తలేమితో ప్రాణాపాయ స్థితిలో ఉన్న నిండు గర్భిణికి రక్తదానం చేసి ఓ యువకుడు కాపాడాడు. వివరాల్లోకి వెళ్తే వజ్రపుకొత్తూరు మండలం అనంతగిరి కాలనీకి చెందిన మోహిని ప్రసవం కోసం టెక్కలి ప్రభుత్వాస్పత్రిలో చేరింది. రక్తలేమితో ఇబ్బందికర పరిస్థితికి చేరుకోవడంతో సమస్యను నవతరం సేవా సంఘం తరఫున తెలుసుకున్న పలాస మండలం రామకృష్ణాపురం గ్రామానికి చెందిన అవినాష్ నేరుగా బి–నెగిటివ్ రక్తాన్ని అందించి ఆదుకున్నారు. ఆయనకు కుటుంబ సభ్యులు, బంధువులు, ఆస్పత్రి వర్గాల వారు కృతజ్ఞతలు తెలిపారు.

### బార్ అసోసియేషన్ అధ్యక్షురాలిగా విజయలక్ష్మీబాయి



ఆమదాలవలస: ఆమదాలవలస సివిల్ జడ్జి కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షురాలిగా సీనియర్ న్యాయవాది కణితి విజయలక్ష్మీబాయి ఎన్నికయ్యా రు. వరుసగా మూడుసార్లు అసోసియేషన్ అధ్యక్షురాలిగా పదవిని దక్కించుకున్నట్లు ఆ మె తెలిపారు. రెండుసార్లు ఏకగ్రీవంగా, ఒక సారి ఎన్నికల్లో పదవిని దక్కించుకున్నారు. మ హిళా న్యాయవాది బార్ అసోసియేషన్ అధ్యక్షురాలిగా రాష్ట్ర వ్యాప్తంగా ఒక్క ఆమదాలవలసలోనే ఉన్నట్లు ఆమె తెలిపారు. సోమవారం బార్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల అధికారిగా సీనియర్ న్యాయవాది సాదు ధనుంజయరావు వ్యవహించారు. ఒకే నామినేషన్ దాఖలు కావడంతో ఆమెను న్యా యవాదులంతా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా డోల రమ ణమూర్తి, కార్యదర్శిగా అల్లాడ విజయ్‌కుమా ర్, సహాయ కార్యదర్శిగా బొడ్డేపల్లి మోహనరావును ఎన్నుకున్నారు.

# ఎన్నికల సన్నద్ధతపై సమీక్ష


ఉన్నత స్థాయి సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

భువనేశ్వర్: రాష్ట్రంలో త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలపై సన్నద్ధత సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ కార్యకలాపాలను ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి ప్రదీప్ కుమార్ జెనా ప్రత్యక్షంగా సమీక్షించారు. రాష్ట్రంలో ఒకేసారి లోక్‌సభ, విధానసభకు ఎన్నికలు జరగనున్నాయి.

ఈ మేరకు తేదీలు ఖరారు అయిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా కేంద్ర సాయుధ పోలీసు దళం (సీఏపీఎఫ్), రాష్ట్ర సాయుధ పోలీసు దళం (ఎస్‌ఏపీఎఫ్) మోహరింపుపై చీఫ్ సెక్రటరీ ప్రదీప్ కుమార్ జెనా అనుబంధ అధికారులతో చర్చించారు. ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) నికుంజ బిహారీ ధొలా, అదనపు ప్రధాన ఎన్నికల అధికారి ఎస్.తిరుమల నాయక్, డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ అరుణ్ కుమార్ షడంగి, హోం శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి దేవరంజన్ కుమార్ సింగ్, పోలీసు శాఖ సీనియర్ అధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు. మే 13 నుంచి రాష్ట్రంలో లోక్‌సభ, అసెంబ్లీలకు 4 దశల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో శాంతిభద్రతల చర్యలపై సమావేశంలో ప్రధానంగా చర్చించారు. రాష్ట్రవ్యాప్తంగా శాంతిభద్రతల సమగ్ర పరిరక్షణ, సమస్యాత్మక బూత్‌ల నిర్వహణ, కేంద్ర సాయుధ పోలీసు దళం (సీఏపీఎఫ్) రాష్ట్ర సాయుధ పోలీసు దళం (ఎస్‌ఏపీఎఫ్) సహా పోలీసు బలగాల మోహరింపు ప్రధానాంశాలుగా సమీక్షించారు.

ఎన్నికల పోలింగ్ తదనంతర భద్రత, రక్షణ అంశాలు ఈ సమావేశంలో ప్రాధాన్యత సంతరించుకున్నాయి. పోలింగ్ ముగియడంతో ఓట్లతో నిండిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవీఎం) భద్రత అతి పెద్ద సవాలు. అలాగే పోలింగ్ పురస్కరించుకుని ఈ యంత్రాల పనితనంపై చిట్ట చివరి క్షణం వరకు నిఘా అత్యంత కీలకమని అధికారులకు వివరించారు. పోలింగ్ ముగిసిన తర్వాత ఈవీఎంలు భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రత, రక్షణ వ్యవస్థని ప్రముఖ కార్యదర్శి సమీక్షించారు.

# తాగుబోతు మాస్టారు మాకొద్దు


విద్యాశాఖ అధికారికి ఫిర్యాదు చేసిన విద్యార్థులు

- డీఈవోకి విద్యార్థుల ఫిర్యాదు


టెంటాలిగుడ పాఠశాల ఇదే


హెచ్ఎం సంతోష్ కుమార్ సాహు

రాయగడ: ఎల్లప్పుడూ తప్పతాగి స్కూల్‌కి వచ్చి విద్యార్థులను ఇబ్బంది పెడుతున్న తాగుబోతు మాస్టారు తమకు వద్దని పాఠశాల విద్యార్థులు జిల్లా విద్యాశాఖ అధికారి బసంత కుమార్ నాయక్‌తో మొరపెట్టుకున్నారు. ఈ మేరకు ఒక వినతి పత్రాన్ని సోమవారం అందజేశారు. వివరాల్లోకి వెళ్తే.. సదరు సమితి పరిధి టెంటాలిగుడ గ్రామంలో అప్పర్ ప్రైమరీ పాఠశాలలో 52 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో 27 మంది బాలురు, 25 మంది బాలికలు ఉన్నారు. ఒకటో తరగతి నుంచి 8వ తరగతి వరకు పనిచేసేందుకు ఐదుగురు ఉపాధ్యాయులు ఉన్నారు. వీరిలో హెచ్ఎంగా సంతోష్ కుమార్ సాహు విధులను నిర్వహిస్తున్నారు. ప్రతిరోజూ తప్పతాగి వస్తూ ఇటు ఉపాధ్యాయులకు, అటు విద్యార్థులకు నానా ఇబ్బందులు పెడుతున్నాడు. దీంతో హెచ్ఎం వికృత చేష్టలను జిల్లా విద్యాశాఖ అధికారి దృష్టికి తీసుకెళ్లారు. ప్రతిరోజూ మద్యం సేవించి పాఠశాలకు వస్తున్నాడని ఫిర్యాదు చేశారు. ఒక్కోసారి తప్పతాగి తన గదిలో మూత్ర విసర్జన చేసి విద్యార్థులను శుభ్రం చేయమంటారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు ఎట్టకేలకు తమ దృష్టికి తీసుకురావడంతో ఇలా ఫిర్యాదు చేయాల్సి వచ్చిందని పాఠశాల కమిటీ అధ్యక్షుడు మున్నా తాడింగి తెలియజేశారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

**దర్యాప్తు చేపడతాం**

హెచ్ఎంపై వచ్చిన ఫిర్యాదును పరిగణలోకి తీసుకుని దర్యాప్తు చేపడతామని విద్యాశాఖ అధికారి నాయక్ తెలియజేశారు. ఇటువంటి సమస్య తన దృష్టికి ఇంతవరకు రాలేదన్నారు. మూడేళ్ల క్రితం ఈ పాఠశాలకు హెచ్ఎంగా సంతోష్ కుమార్ సాహు బదిలీపై వచ్చారన్నారు. ఏదిఏమైనప్పటికీ సమస్యను పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

### బస్సు, వ్యాన్ ఢీ

- బస్సు డ్రైవర్ మృతి


ప్రమాద స్థలంలో బస్సు డ్రైవర్ మృతదేహం

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి ఎంవీ 23 గ్రామం వద్ద సోమవారం సాయంత్రం బస్సు, పికప్ వ్యాన్‌లు ఢీకొన్న ఘటనలో బస్సు డ్రైవర్ మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. కలిమెల సమితి ఎంవీ 79 గ్రామం నుంచి విశాఖపట్నం బయల్దేరిన హైటెక్ బస్సు సాయంత్రం 7 గంటలు సమయంలో ఎంవీ 23 గ్రామం వద్ద ఇసుప రాడ్లతో వస్తున్న ఒక వ్యాన్‌ను ఢీకొంది. ప్రమాదంలో బస్సు డ్రైవర్‌కు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వ్యాన్ డ్రైవర్, బస్సులో ప్రయాణికులకు స్వల్ప గాయాలవ్వడంతో క్షతగాత్రులను మల్కన్‌గిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతి చెందిన బస్సు డ్రైవర్ ఆర్‌వీ రావు విజయనగరం జిల్లాకు చెందినవాడిగా తెలుస్తోంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ప్రమాద దృశ్యం

# రెడ్‌క్రాస్‌లో సింగిల్ డోనర్ ప్లేట్‌లెట్స్ పరికరం


ఎస్‌డీపీ ద్వారా రక్తదానం చేస్తున్న యువకుడు శంకర్

శ్రీకాకుళం కల్చరల్: ఇండియన్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో సింగిల్ ప్లేట్‌లెట్స్(ఎస్‌డీపీ) పరికరం ప్రారంభించామని అందరూ సద్వినియోగం చేసుకోవాలని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు అన్నారు. స్థానిక రెడ్‌క్రాస్ రక్తనిధి కేంద్రంలో ఎస్‌డీపీ ద్వారా రక్తదానం కార్యక్ర మం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 55 కిలోల బరువుతో ఉండి, 13 శాతం హిమోగ్లోబిన్ ఉండే ప్రతి ఒక్కరూ రక్తదానం చేయ వచ్చని అన్నారు. వాతావరణ మార్పులతో డెంగీ, మలేరియా జ్వరాల బారిన పడి ప్రాణాలను పోగొట్టుకుంటున్నారని, ఇందులో పసి పిల్లలు నుంచి పెద్దల వరకు ఉండడం బాధాకరమని అన్నారు. వీటి బారిన పడిన వ్యక్తులకు ప్లేట్‌లెట్స్ సంఖ్య తగ్గుతోందన్నారు. ఈ రోజు జెమ్స్ వైద్య కళాశాలలో అత్యవసరంగా బి పాజిటివ్ ప్లేట్‌లెట్స్ అవసరం కాగా పాలకొండ, అంపిలికి చెందిన ఎ.శంకరరావు ఎస్‌డీపీ పరికరం ద్వారా రక్తదానం చేశారని తెలిపారు.

# ఆటో ఢీకొని వ్యక్తి మృతి


లోకనాథం (ఫైల్)

టెక్కలి రూరల్: సంతబొమ్మాళి మండలం పెద్ద మర్రిపాడు గ్రామ సమీపంలో సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో దేవనల్తాడ గ్రామానికి చెందిన తేరిపల్లి లోకనాథం(30) మృతిచెందాడు. ఈ మేరకు స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. లోకనాథం తన తమ్ముడు తాతయ్యతో కలిసి చిన్నమర్రిపాడు గ్రామంలో జరుగుతున్న ఎల్లమ్మ జాతరకు బైక్‌పై బయల్దేరాడు. పెద్ద మర్రిపాడు చెరువు మలుపు వద్ద ఎదురుగా వచ్చిన ఓ ఆటో లోకనాథం బైక్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో ద్విచక్రవాహనం నడుపుతున్న లోకనాథం తలకు తీవ్ర గాయమైంది. దీంతో అతడిని పోలీసు వాహనంలో టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అయితే వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి తల్లిదండ్రులు లేరు. అన్నదమ్ములు కలిసి ఉంటున్నారు. మృతుడి అన్న దేవునల్తాడ సర్పంచ్ వరదరాజు. ఈ ఘటనపై నౌపడ ఎస్‌ఐ కిశోర్ వర్మ కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

### ● ఎంత వి'ఛత్రం'!


లక్షల విలువైన కారుపై తాటికమ్మల గొడుగును కట్టేసి ప్రయాణిస్తున్న దృశ్యం సోమవారం శ్రీకాకుళం జాతీయ రహదారిపై ఇలా కనిపించింది. ఎండలు మండిపోతున్న తరుణంలో ఈ దృశ్యం కనిపించడంతో వాహనదారులు ఆసక్తిగా గమనించారు.

– అరసవల్లి

### 'ఓపెన్ స్కూల్' పరీక్షలు ఆరంభం

శ్రీకాకుళం న్యూకాలనీ : జిల్లాలో సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్) ద్వారా పది, ఇంటర్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఓపెన్ స్కూల్ పరీక్షలు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరిగాయి. జిల్లా వ్యాప్తంగా 4 కేంద్రాల్లో జరిగిన ఓపెన్ టెన్త్ పరీక్షలకు 644 మంది హాజరుకావాల్సి ఉండగా 85 మంది గైర్హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా 7 కేంద్రాల్లో జరిగిన ఓపెన్ ఇంటర్ పరీక్షలకు 1351 మంది హాజరుకావాల్సి ఉండగా 125 మంది గైర్హాజరయ్యారు. 7 సిట్టింగ్, మరో 3 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు విస్తృతంగా తనిఖీ చేశాయి. ఈ పరీక్షలను డీఈఓ కె.వెంకటేశ్వరరావు, ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ లియాఖత్ ఆలీఖాన్, ఇతర అధికారులు పర్యవేక్షించారు.

### ఉచిత కంటి వైద్య శిబిరం రేపు

శ్రీకాకుళం పాతబస్టాండ్: శ్రీకాకుళం జిల్లా బార్ అసోసియేషన్ కొత్త భవనంలో బుధవారం ఉదయం 9.45కు ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు జిల్లా బార్ అసోసియేషన్ ఆపద్ధర్మ అధ్యక్షుడు డాక్టర్ ఎన్ని సూర్యారావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ వైద్య శిబిరం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా ప్రారంభిస్తారని ఆయన తెలిపారు. ఈ శిబిరం 'ఐ ఎక్స్‌ప్రెస్' డాక్టర్ ఎం.సుమన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తారని తెలిపారు. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని న్యాయవాదులు, గుమస్తాలు, కోర్టు సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

### హత్య కేసులో నిందితుడు అరెస్ట్

మందస: మండలంలోని సొండిపూడి గ్రామానికి చెందిన లైకెట్టి నీలాద్రి అలియాస్ ప్రకాశరావు ఇటీవల దారుణహత్యకు గురయ్యాడు. ఈ కేసులో మృతుని సోదరుడు కూర్మారావు అలియాస్ కుమార్‌పై అనుమానాలు వ్యక్తమయ్యాయి. హత్య జరిగిన వెంటనే కూర్మారావు పరారు కావడంతో అనుమానాలు బలపడ్డాయి. కాశీబుగ్గ రూరల్ సీఐ పి.ఈశ్వరరావు ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేశారు. అనంతరం కూర్మారావును సీఐ ఈశ్వరరావు అరెస్ట్ చేశారు. నిందితుడిని ఇచ్ఛాపురం కోర్టుకు తరలించగా, న్యాయమూర్తి రిమాండ్ విధించారని, శ్రీకాకుళం జైలుకు తరలించామని సీఐ ఈశ్వరరావు సోమవారం చెప్పారు.

# ఎమ్మెల్యే మహ్మద్ మొకీమ్‌కు ఊరట


మహ్మద్ మొకీమ్

భువనేశ్వర్: రాష్ట్రంలో కటక్ బారాబటి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 2019లో గెలిపొందిన కాంగ్రెస్ ఎమ్మెల్యే మహ్మద్ మొకీమ్ ఎన్నికను రద్దు చేస్తూ ఒరిస్సా హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టు సోమవారం స్టే విధించింది. న్యాయమూర్తులు సూర్యకాంత్, కె.వి.విశ్వనాథ్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం మొకీమ్ తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది డాక్టర్ ఎస్.మురళీధర్ వాదనను అంగీకరించింది. ఈ మేరకు 693 పుటలతో ధర్మాసనం భారీ తీర్మానం జారీ చేయడం గమనార్హం. 2019 ఎన్నికల్లో 3,827 ఓట్ల తేడాతో ఓడిపోయిన తర్వాత మొకీమ్ ఎన్నికను సవాలు చేసిన బిజూ జనతా దళ్ నాయకుడు దేబాశిష్ సామంతరాయ్‌కు సుప్రీం కోర్టు నోటీసు పంపింది. ఈ ఎన్నికలో పోటీ పురస్కరించుకుని మొకీమ్ దాఖలు చేసిన అఫిడవిట్‌లో తనపై పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కేసులను బహిరంగపరచలేదని ఆరోపించారు. ఈ ఏడాది మార్చి 4న జస్టిస్ సంగమ్ కుమార్ సాహూతో కూడిన ఏకసభ్య ధర్మాసనం 1951 ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 33 ప్రకారం మొకీమ్ తన నామినేషన్ పత్రాలను సమర్పించలేదని గమనించింది. ఆయనకు వ్యతిరేకంగా పెండింగ్‌లో ఉన్నటువంటి 13 నేర సంబంధిత కేసులకు సంబంధించి సరైన వివరాలు ప్రకటించకుండా నామినేషన్ దస్తావేజులతో పాటు అఫిడవిట్ దాఖలు చేసినట్లు ధర్మాసనం పరిశీలించింది. అందుచేత మొకీమ్ నామినేషన్ తిరస్కరణకు ఆమోదించాల్సిందనేనని జస్టిస్ సంగమ్ కుమార్ సాహూ జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అయితే పరిశీలన దశలో రిటర్నింగ్ అధికారి నామినేషన్‌ను తిరస్కరించాల్సింది. కానీ రిటర్నింగ్ అధికారి అక్రమంగా, అన్యాయంగా మొకీమ్ నామినేషన్ పత్రాలను ఆమోదించారని ఈ ధర్మాసనం వివరించింది.

# సముద్రంలో స్నానం చేస్తూ యువకుడు మృతి

భువనేశ్వర్: మధ్యప్రదేశ్‌కు చెందిన ఓ యువ పర్యాటకుడు సోమవారం పూరీలో సముద్ర స్నానానికి వెళ్లి నీటిలో మునిగి మృతి చెందాడు. శ్రీజగన్నాథుని దర్శనం కోసం 40 మందితో 5 కుటుంబాలు పూరీ తీర్థయాత్రకు విచ్చేశారు. స్వామి దర్శనం తర్వాత చంద్రభాగ బీచ్‌కు వెళ్లారు. అక్కడ స్నానం చేస్తుండగా విషాదం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులతో కలిసి స్నానం చేస్తుండగా ఎగసిపడిన బలమైన కెరటం యువకుడిని ఈడ్చుకుపోయింది. ఈ తాకిడిలో ఓ చిన్నారితో సహా మరో నలుగురు కుటుంబ సభ్యులు బతికి ఒడ్డుకు చేరుకున్నారు. సమాచారం అందుకున్న మెరైన్ ఠాణా పోలీసు బృందం ఘటనా స్థలానికి చేరింది. లైఫ్ గార్డులు, ఇతరుల సహాయంతో యువకుడి మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చి పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుడు 18 ఏళ్ల సుదాం ప్రసాద్ షాగా గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# ఇంటర్ స్పాట్ వాల్యుయేషన్ ప్రారంభం

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్మీడియెట్ స్పాట్ వాల్యుయేషన్ మొదలైంది. శ్రీకాకుళం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల వేదికగా నాలుగు విడతల్లో జరగనున్న ఈ స్పాట్ వాల్యుయేషన్ ప్రక్రియలో భాగంగా సోమవారం మొదటివిడత ప్రారంభమైంది. అయితే మొదటి విడతలో తెలుగు, హిందీ, ఇంగ్లీషు, మాథ్స్, సివిక్స్ పేపర్ల వాల్యూషన్ మొదలుకావాల్సి ఉండగా.. ఆయా సబ్జెక్టుల బోర్డుల ఏర్పాటు పూర్తికావడం ఆలస్యం కావడంతో దిద్దుబాటు ప్రక్రియ మంగళవారం నుంచి షురూ చేయనున్నారు. మధ్యాహ్నం వరకు ఇంటర్మీడియెట్ బోర్డు ఉన్నతాధికారులు అన్ని జిల్లాల స్పాట్ క్యాంప్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, పలు సూచనలు చేశారు. ఆ సూచనలను జిల్లా స్పాట్‌కు హాజరైన సీఈలు, ఏఈలకు సబ్జెక్టులవారీగా తెలియజేయడం, అనంతరం స్కీమ్ ఆఫ్ వాల్యుయేషన్ అందజేయడం తదితర పక్రియలు పూర్తయ్యేసరికి సాయంత్రం కావడంతో తొలిరోజు దిద్దుబాటు ప్రక్రియను ప్రారంభించలేదు. మంగళవారం ఉదయం నుంచే జవాబుపత్రాల దిద్దుబాటును ప్రారంభిస్తామని ఆర్ఐఓ/జిల్లా స్పాట్ క్యాంప్ ఆఫీసర్ ప్రగడ దుర్గారావు పేర్కొన్నారు. జనరల్–1 గణపతి వెంకటేశ్వరరావు, జనరల్–2 పి.శివరాంప్రసాద్, సీసీవో జన్నెల సునీత, సీసీవో–2 బి.శ్యామ్‌సుందర్, కోడింగ్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

**విధిగా రిపోర్ట్ చేయాలి: ఆర్ఐఓ**

ఇంటర్మీడియెట్ బోర్డు అపాయింట్‌మెంట్ ఆర్డర్ వచ్చిన ప్రతి ఒక్కరూ స్పాట్ కేంద్రం వద్ద విధిగా రిపోర్ట్ చేయాలని ఆర్ఐఓ పి.దుర్గారావు స్పష్టం చేశారు.

కాలేజ్ లాగిన్‌లోని జ్ఞానభూమి వెబ్‌పోర్టల్ బీఐఈఏపీ సర్వీసెస్‌లో అపాయింట్‌మెంట్ ఆర్డర్ అందుకుని రిపోర్ట్ చేయని వారికి మెమోలు అందజేస్తామన్నారు. రోజుకు రూ.1000 చొప్పున ఫైన్ కూడా ఉంటుందన్నారు. స్పాట్ ఆర్డర్ వచ్చిన వారు రిపోర్ట్ చేయాల్సిందేనని ఆయన పేర్కొన్నారు.

# 20 కిలోల గంజాయితో ఒడిశా యువకుడు అరెస్టు


20 కిలోల గంజాయి మూటతో ఒడిశా యువకుడు కరడా కరుణా

కాశీబుగ్గ: పలాస రైల్వేస్టేషన్ ఆవరణలో ఇరవై కిలోల గంజాయి తరలిస్తున్న ఒడిశా యువకుడిని సోమవారం సాయంత్రం పట్టుకున్నారు. ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా ఆర్.ఉదయగిరి రెవెన్యూ బ్లాక్, చివిగడ పంచాయతీ రాజపురం గ్రామానికి చెందిన కరడా కరుణా బైక్‌పై గంజాయి తరలిస్తూ పలాస రైలు నిలయం ఎదురుగా పట్టుబడ్డాడు. రూ.ఇరవై వేలకు గంజాయి కొని చెన్నైకు తరలిస్తున్నాడని, రూ.లక్షకు బేరం కుదుర్చుకున్నాడని విచారణలో తేలింది. చెన్నై ఇటుకల పరిశ్రమలో వలస కార్మికుడిగా పనిచేస్తున్న కరుణాకు సైడ్ వ్యాపారంగా గంజాయి అమ్మకాలు సాగిస్తూ పలాస రైలు నిలయానికి వచ్చి వెళ్తుంటాడని పోలీసులు వెల్లడించాడు. ఎస్ఐ ఎం.వెంకటరావు, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ కలంకూరి మధుబాబు, వీఆర్‌ఓ లోపింటి వెంకటరమణ, హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసరావు, పిసిలు ఈశ్వరరావు, నీలకంఠం, హెచ్‌సీ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### సైకత శుభాకాంక్షలు



పవిత్రమైన రంజాన్ మాసం సందర్భంగా ముస్లిం సోదరులకు సైకత శుభాకాంక్షలు తెలిపారు. మండలంలో గాజులకొల్లివలస గ్రామం సమీపంలో సంగమేశ్వర ఆలయం వద్ద సైకత శిల్పి గేదెల హరికృష్ణ వేసిన రంజాన్ సైకత శిల్పం ఆకట్టుకుంటుంది. – ఆమదాలవలస రూరల్

# రోడ్డు ప్రమాదంలో టెన్త్ విద్యార్థి మృతి


పాలక కల్యాణ్ (ఫైల్)

కొత్తూరు : మండలంలోని మహసింగి గ్రామం సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పాలక కల్యాణ్(15) అనే పదో తరగతి విద్యార్థి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సీతంపేట మండలం కడగండి చెందిన కల్యాణ్ అదే గ్రామానికి చెందిన వి.మణికంఠ, భామిని మండలం లోహరిజోలకు చెందిన వంశీ ముగ్గురూ కలిసి ద్విచక్ర వాహనంపై సీతంపేట నుంచి కొత్తూరు వస్తుండగా.. మహసింగి సమీపంలో వీరి బండిని లారీ ఢీకొట్టింది. ప్రమాదంలో కల్యాణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మిగతా ఇద్దరినీ రాగోలు జెమ్స్ ఆస్పత్రికి తరలించారు. అందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎంఏ అహ్మద్ తెలిపారు. ప్రమాదానికి గురైన వారు స్థానిక ఏకలవ్య పాఠశాలలో పదో తరగతి చదివారు. సీబీఎస్‌సీ కావడంతో టెన్త్ పరీక్షలు ముగించుకుని హాస్టల్ నుంచి రిలీవ్ అయిపోయారు. కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.

## క్లుప్తంగా

### నేడు పోలమాంబ తొమ్మిదవ జాతర



పోలమాంబ అమ్మవారు

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు, మక్కువ మండలంలోని శంబర గ్రామదేవత పోలమాంబ అమ్మవారి తొమ్మిదవ జాతర మంగళవారం జరగనుంది. జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆలయం ఈవో వీవీ సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేపట్టారు. చదురుగుడి, వనంగుడి వద్ద తాగునీటి సౌకర్యం కల్పించడంతో పాటు, ప్రసాదం కౌంటర్లను ఏర్పాటు చేశారు. జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ఎస్సై పి.నరసింహమూర్తి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు.

### గేట్‌లో 288వ ర్యాంక్



విష్ణువర్ధన్

విజయనగరం అర్బన్: పబ్లిక్ సెక్టార్‌లో ఉన్నత స్థాయి ఇంజినీరింగ్ ఉద్యోగాలకు, ప్రతిష్టాత్మక ఇంజినీరింగ్ కళాశాలల్లో పీజీ కోర్సులో ప్రవేశాలకు నిర్వహించే 'గేట్' పోటీ పరీక్షలో గంట్యాడ మండలం, లక్కిడాం గ్రామానికి చెందిన కిలపర్తి విష్ణువర్ధన్ 288 వ ర్యాంక్ సాధించాడు. ఇంజనీరింగ్‌లో కంప్యూటర్ సైన్స్ విభాగంలో 798 స్కోర్ తెచ్చుకోగా ఈ ర్యాంక్ లభించిందని విష్ణువర్ధన్ సోమవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నాడు. తండ్రి కిలపర్తి అప్పలనాయుడు, సత్యవతి ఉద్యోగరీత్యా విజయనగరం పట్టణంలోని వీటీఅగ్రహారంలో ఉంటున్నారు. కోచింగ్‌కు ఎక్కడికీ వెళ్లకుండా మంచి ర్యాంక్ తెచ్చుకున్నందుకు పలువురు అభినందనలు తెలిపారు.

### నేడు వైద్య, ఆరోగ్యశాఖ గ్రీవెన్స్‌డే

పార్వతీపురం టౌన్: ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ జె.శ్రీనివాస్ ఆదేశాల మేరకు పార్వతీపురం మన్యం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో మంగళవారం గ్రీవెన్స్‌డే నిర్వహిస్తున్నామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.జగన్నాథరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ పరిధిలో పనిచేసే వారికి ఎవరికైనా జీతాలకు సంబధించిన సమస్యలు ఉంటే ఈనెల 19న మధ్యాహ్నం 3 గంటలకు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారిని వ్యక్తిగతంగా కలసి వినతిపత్రాలు అందజేయాలని పేర్కొన్నారు.

విజయనగరంలో..

విజయనగరం ఫోర్ట్: వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో పని చేస్తున్న వైద్య ఉద్యోగులకు మంగళవారం గ్రీవెన్స్ డే నిర్వహించనున్నట్టు విజయనగరంజిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. భాస్కరరావు సోమవారం ఒక ప్రకటనలతో తెలిపారు. వేతనాలకు సంబంధించి ఎలాంటి సమస్యలున్నా కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు విన్నవించుకోవాలని సూచించారు.

### 100 కేజీల పీడీఎస్ బియ్యం స్వాధీనం

దత్తిరాజేరు: మండలంలోని కె.కొత్తవలసలో వ్యాపారి ఇంట్లో అక్రమంగా నిల్వ ఉన్న 100 కేజీల రేషన్ బియ్యన్ని పట్టుకుని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్.బూర్జవలస ఎస్సై లక్ష్మీప్రసన్నకుమార్ సోమవారం తెలిపారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు వ్యాపారి డి.కామేశ్వరరావు ఇంట్లో ఉన్న బియ్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి మండల పౌర సరఫరాల అధికారికి అప్పగించినట్లు చెప్పారు.

### పోక్సో కేసులో ముద్దాయికి ఏడేళ్ల జైలు

విజయనగరం క్రైమ్: పోక్సో కేసులో నేరారోపణ రుజువైన అనంతరం ముద్దాయికి ఏడేళ్ల జైలు శిక్ష, రూ. 3,500 జరిమానా విధిస్తూ ప్రత్యేక పోక్సో న్యాయస్థానం తీర్పు వెల్లడించిందని ఎస్పీ ఎం.దీపిక సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. జామి మండలంలోని మొకాస కొత్తవలస గ్రామానికి చెందిన ఆబోతుల సత్తిబాబు గ్రామంలో నివాసం ఉంటున్న బాలికపై లైంగిక దాడికి పాల్పడినట్లు బాధిత బాలిక తల్లి చేసిన ఫిర్యాదు మేరకు జామి ఎస్సై వీరబాబు పోక్సో చట్టం ప్రకారం 2023 సెప్టెంబర్ 20న కేసు నమోదుచేశారు. ఈ మేరకు విజయనగరం సబ్ డివిజన్ డీఎస్పీ ఆర్.గోవిందరావు దర్యాప్తు పూర్తిచేసి, నిందితుడిని అరెస్టు చేసి, న్యాయస్థానంలో అభియోగపత్రం దాఖలు చేశారు. కేసులో స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మావూరి శంకరరావు వాదనలు వినిపించగా, విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు పర్యవేక్షణలో కోర్టు హెచ్‌సీ కారు శ్రీను సాక్షులను కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్పీ ప్రకటనలో పేర్కొన్నారు.

## ఎన్నికల నిర్వహణలో...
# ఐటీ ఆధారిత సేవలు

- సాంకేతిక సేవల విస్తృత వినియోగం
- అవగాహన కల్పనలో ఎన్నికల అధికారులు బిజీ



యాప్‌లు, పోర్టల్‌లు వినియోగంపై శిక్షణ ఇస్తున్న నోడల్ అధికారి సుధాకరరావు

విజయనగరం అర్బన్: సార్వత్రిక ఎన్నికల నిర్వహణ వ్యవస్థలో ఆధునిక సాంకేతిక సేవల వినియోగంపై కేంద్ర ఎన్నికల కమిషన్ దృష్టి సారించింది. అక్రమాల కట్టడి, ఫిర్యాదుల స్వీకరణ, అనుమతుల జారీ వంటి పలుసేవల్లో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) ఆధారిత సాంకేతిక సేవలను అమలులోకి తెచ్చింది. వాటిని సమర్థవంతంగా వినియోగించుకునేలా జిల్లా అధికారుల నుంచి క్షేత్రస్థాయి సిబ్బంది, ఓటరుకు అందుబాటులోకి తెచ్చే చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా సువిధ, సీ-విజిల్, అబ్జర్వర్ పోర్టల్, పబ్లిక్ పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఫిర్యాదులపై తక్షణం స్పందించేలా అధికార యంత్రాంగాన్ని సన్నద్ధం చేసే వ్యవస్థను తీసుకొచ్చింది. ఓటర్లు కూడా దీనిని సమర్థంగా వినియోగించుకునేలా ముందస్తు కసరత్తు జిల్లా స్థాయి నుంచి ప్రారంభించింది. దీనికోసం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి జిల్లాలోని పలువురు సీనియర్ అధికారులను నోడల్ అధికారులుగా నియమించారు. వీరు ఏయే పనులు నిర్వహించాల్సి ఉంటుందనే అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు నియమితులైన అధికారులకు తొలుత శిక్షణ ఇచ్చారు. పోలింగ్ నిర్వహణ, ఓట్ల లెక్కింపు, నోడల్, అకౌంటింగ్ బృందం, ఐటీ, వెబ్ కాస్టింగ్ తదితర అంశాలను వివరించారు. పోస్టల్ బ్యాలెట్ల ప్రక్రియ, ఓట్ల లెక్కింపు, వయోవృద్ధుల ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించుకోవడం వంటి అంశాలపై తర్ఫీదునిస్తున్నారు. భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ఐటీ ఆధారిత సేవలను ఈసారి మరింత విస్తృతంగా వినియోగించుకోనున్నారు.

### ఓటర్లకు సమాచారం అందించేందుకు పబ్లిక్ పోర్టల్

ఓటర్లకు ఎప్పటికప్పుడు సమాచారం అందించేందుకు పబ్లిక్ పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చారు. తమ ఓటు ఉందా, లేదా... ఉంటే ఏ పోలింగ్ కేంద్రంలో ఉంది, ఆ పోలింగ్ కేంద్రం ఎక్కడ ఉంది, బూత్ లెవెల్ అధికారి ఎవరు, ఫొటో ఓటరు గుర్తింపు కార్డు (ఎపిక్) సంఖ్య వంటి ఓటరుకు అవసరమైన సమస్త సమాచారాన్ని పబ్లిక్ పోర్టల్ ద్వారా తెలుసుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

### ప్రచార అనుమతులకు 'సువిధ' యాప్

ఎన్నికల్లో పోటీ చేసే రాజకీయ పార్టీల అభ్యర్థులు తాము నిర్వహించుకునే సభలు, సమావేశాలు, ఇతర ప్రచార కార్యక్రమాలకు అధికార యంత్రాంగం నుంచి ముందస్తుగా అనుమతి పొందాల్సి ఉంటుంది. గతంలో అయితే మాన్యువల్‌గా రిటర్నింగ్ అధికారుల నుంచి అనుమతులు తెచ్చుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం వీటి కోసం అభ్యర్థులు, వారి అనుచరులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పని ఉండదు. వీటికి సంబంధించిన అనుమతులను సువిధ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లోనే జారీ చేస్తారు.




ఎన్నిక నిర్వహణలో వినియోగిస్తున్న వివిధ యాప్‌లు, పోర్టల్‌లు

### ప్రలోభాల కట్టడికి 'సీ-విజిల్'

ఎన్నికల్లో పోటీ అభ్యర్థుల ప్రలోభాలపై ఫిర్యాదులు తీసుకోవడానికి 'సీ-విజిల్' అనే యాప్‌ను వినియోగంలోకి తెచ్చారు. నగదు, మద్యం పంపిణీ, ఓటర్లను భయపెట్టి పోలింగ్ కేంద్రాలకు రాకుండా చేయడం ఇతర ప్రలోభాలకు గురిచేసి లబ్ధిపొందాలని చూడటం వంటి అక్రమాలను కట్టడి చేసేందుకు ఈ యాప్ అందుబాటులోకి తెచ్చారు. అక్రమాలకు సంబంధించిన చిత్రాలు, వీడియోలు, లొకేషన్‌ను ఈ యాప్‌లో పొందుపరిస్తే ఎన్నికల ప్రవర్తన నియమావళిని అమలు చేసే అధికారులు తక్షణ చర్యలు తీసుకునేలా ఏర్పాటు చేశారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చిన నాటి నుంచి దీనిని వినియోగించనున్నారు.

### సేవలకు 'సాక్ష్యం'

ఎన్నికల నిబంధనలు, సేవలు వంటి అంశాలపై దివ్యాంగులకు అవగాహన కలిగించే యాప్ సాక్ష్యం. అదే విధంగా దివ్యాంకులకు ఇంటి వద్దే ఓటింగ్ చేసుకోవడానికి అవసరమైన సమాచార సేవలు అందిస్తుంది.

### ఆదేశాల సత్వర అమలుకు...

ఎన్నికల కమిషన్, జిల్లా ఎన్నికల అధికారి నుంచి వచ్చే ఆదేశాలు ఎన్నికల నిర్వహణ సిబ్బందికి వేగంగా చేరేలా చేసేందుకు అబ్జర్వర్ పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఎన్నికల పరిశీలకుల పర్యవేక్షణలో ఈ పోర్టల్ పూర్తి స్థాయిలో పనిచేస్తుంది.

**సాంకేతిక సేవల వినియోగంపై అవగాహన**

సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు అందుబాటులోకి వచ్చిన సాంకేతిక సేవలపై క్షేత్రస్థాయిలో అవగాహన పెంచాలి. జిల్లా స్థాయి నోడల్ అధికారుల నుంచి క్షేత్రస్థాయి ఓటరు వరకు తెలుసుకోవలసిన పోర్టల్స్, యాప్‌లు ఉన్నాయి. వినియోగంపై విస్తృత స్థాయిలో ప్రచారం చేపట్టాం. వీటి వినియోగంపై పూర్తి స్థాయిలో అవగాహన ఉంటే ఎన్నికలు విజయవంతంగా జరుపుకోవడానికి అవకాశం ఉంటుంది. ఆ దిశగా ఎన్నికల నిర్వహణ సిబ్బంది పనిచేయాలి.
– ఎస్.నాగలక్ష్మి, కలెక్టర్

# కలెక్టరేట్‌లో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకం



ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను విక్రయిస్తున్న సిబ్బంది

పార్వతీపురంటౌన్: ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు పండిస్తున్న పంటల ఉత్పత్తికి కొనుగోలుదారులు ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నారని పార్వతీపురం మన్యం జిల్లా వ్యవసాయశాఖాధికారి రాబర్ట్‌పాల్, ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ షణ్ముఖరాజులు తెలిపారు. ఈ మేరకు జిల్లా రైతులు పండిస్తున్న ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకం శిబిరాన్ని కలెక్టరేట్ ప్రాంగణంలో వ్యవసాయశాఖ రైతు సాధికారత సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రైతులు ప్రకృతి వ్యవసాయ సాగుకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని, వినియోగదారులు కూడా ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రకృతి వ్యవసాయం, ప్రకృతి సేద్యం కొంతకాలంగా అభివృద్ధి చెందుతోందని సంతోషం వెలిబుచ్చారు. ప్రకృతి వ్యవసాయం అతితక్కువ ఖర్చుతో కూడుకున్నదని, ఆదాయం ఎక్కువగా వస్తుందన్నారు. గో ఆధారిత సహజ ఎరువుల, మిశ్రమాలతో ప్రకృతిలో సహజంగా దొరికే వనరులతో కషాయాలు, నూనెలు తయారు చేసుకుని, భూసారాన్ని పెంచుకుంటూ, చీడపీడల్ని నివారించి, అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. అలాగే పర్యావరణాన్ని కాపాడుకుంటూ వినియోగదారులకు నాణ్యమైన రసాయన రహిత ఆహారాన్ని రైతులు అందిస్తున్నారని వివరించారు. రైతులు ఎటువంటి రసాయనాలు ఉపయోగించకుండా పండించిన బియ్యం, మిల్లెట్స్, బెల్లం, కూరగాయలు మొదలైనవి ఈ శిబిరంలో విక్రయిస్తారని తెలిపారు. వాటిని కొనుగోలు చేసి ప్రకృతి వ్యవసాయ రైతులను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది వై. తిరుపతిరావు, బి.తిరుపతినాయుడు, గంగరాజు, ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు తదితరులు పాల్గొన్నారు.

# జగనన్న మహిళా పక్షపాతి

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్ రాజు



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్ రాజు

పార్వతీపురం టౌన్: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పేదల కోసం ఒక అడుగు ముందుకు వేస్తే..అదే పేదలకోసం ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి నాలుగు అడుగులు ముందుకేసి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్తున్నారన్నారని వైఎస్సార్‌సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్ రాజు అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో మహిళా విభాగ కమిటీ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి క్షేత్రస్థాయిలో చిన్నపాటి సమస్యను కూడా తీరుస్తూ మనకు అండగా నిలిచారన్నారు. జగన్‌మోహన్ రెడ్డి మహిళా పక్షపాతిగా మహిళల గౌరవాన్ని పెంచారని చెప్పారు. నాలుగున్నరేళ్ల ఆయన పరిపాలన కాలంలో రాష్ట్రంలో ఏ సంక్షేమ పథకం అమలు చేసినా మహిళల పేరిట అందజేసినట్లు చెప్పారు. మహిళలంతా జగనన్నకు ఆత్మబంధువుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా మహిళా విభాగ అధ్యక్షురాలు రెడ్డి పద్మావతి, స్టేట్ వైస్ ప్రెసిడెంట్ మాధవి, జోనల్ ఇన్‌చార్జి పద్మావతి, దాసరి కార్పొరేషన్ చైర్మన్ రంగుముద్రి రమాదేవి, మహిళా నాయకులు పాల్గొన్నారు.

# అక్రమంగా టేకుచెట్ల నరికివేత

- రూ.లక్ష విలువైన కలప తరలించేందుకు యత్నం



పంప్‌హౌస్ ప్రాంగణంలో ఉన్న టేకు కలప

శృంగవరపుకోట: ఎన్నికల కోడ్ కూసింది. ఇక అధికారులు ఎవ్వరూ పట్టించుకోరు. దోచుకున్న వాడికి దోచుకున్నంత అనుకున్నాడు ఓ క్రాంటాక్టర్. సిబ్బందితో కుమ్మక్కై, పంప్‌హౌస్ ప్రాంగణంలోని టేకుచెట్లను అక్రమంగా నరికేసి తరలించడానికి ప్రణాళిక సిద్ధం చేశాడు. అయితే ఈ విషయం మీడియాకు చేరడంతో చివరి నిమిషంలో కలప రవాణాకు బ్రేక్ పడింది. విజయనగరం పురపాలక సంఘం అధీనంలో తాటిపూడి జలాశయం నుంచి విజయనగరం పట్టణానికి తాగునీరు పంపే మధుపాడ పంప్‌హౌస్ ప్రాంగణంలో టేకుచెట్లు ఉన్నాయి. పంప్‌హౌస్ మెయింటనెన్స్ కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్న రాంప్రసాద్ ఆ టేకుచెట్లపై కన్నేశాడు. అక్కడి సిబ్బందికి నచ్చజెప్పి అక్రమంగా టేకుచెట్లు నరికేశాడు. కార్యాలయం ప్రాంగణంలోనే దర్జాగా కలపను సైజులు కోసి ఉంచారు. సోమవారం ఆ కలపను తరలించేందుకు రంగం సిద్ధం చేశాడు. దీంతో స్థానికులు కొందరు మీడియాకు సమాచారం ఇవ్వడంతో విషయం బయటకు పొక్కింది. టేకుచెట్లు ఎందుకు నరికారంటూ మీడియా ప్రతినిధులు అడగ్గా డీఈ అనుమతి తీసుకున్నామని కాంట్రాక్టర్ జవాబిచ్చాడు. డీఇ అప్పారావును దీనిపై వివరణ కోరగా, తనకేమీ సంబంధం లేదని తాను ఎవ్వరికీ పర్మిషన్ ఇవ్వలేదని చెప్పారు. సదరు కాంట్రాక్టర్ రెండు రోజులుగా చెట్లు నరుకుతున్నా అధికారులు పట్టించుకోకుండా వదిలేయడం వెనుక వారి పాత్ర కూడా ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. సదరు కాంట్రాక్టర్ కొందరు మీడియా ప్రతినిధులను ప్రలోభపెట్టి వార్తలు రాకుండా చూడాలని కొంత సొమ్ము ముట్టజెప్పినట్లు తెలిసింది. ఎస్.కోట అటవీశాఖ ఉద్యోగులు కోతకోసిన కలపకు కొలతలు వేసుకుని వెళ్లారు.

# చోరీకి చెడ్డీ గ్యాంగ్ యత్నం

- అడ్డుకున్న ఓ వ్యక్తికి తీవ్రగాయాలు
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన విశాఖ సీపీ రవిశంకర్



డ్రిల్లింగ్ మిషన్‌తో వేసిన రంధ్రాలు



పరిశీలిస్తున్న విశాఖ సీపీ రవిశంకర్ తదితరులు

డెంకాడ: చింతలవలస ఐదవ ఏపీఎస్‌పీ బెటాలియన్ సమీపంలో ఆదివారం అర్ధరాత్రి చెడ్డీగ్యాంగ్ దొంగతనానికి పాల్పడుతున్న క్రమంలో కేకలు వేసిన వ్యక్తిపై గ్యాంగ్ విచక్షణా రహితంగా దాడికి పాల్పడింది. ఈ దాడిలో ఆ వ్యక్తి తీవ్ర గాయాల పాలై విశాఖపట్నంలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై బాధితులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆదివారం అర్ధరాత్రి 1గంట నుంచి 1.30గంటల ప్రాంతంలో సత్యనారాయణపురంలోని యారబాటి రమణమూర్తి ఇంటిలో చెడ్డీగ్యాంగ్ చోరీకి విఫలయత్నం చేసింది. ఇంటి ప్రధాన ద్వారం గ్రిల్స్‌కు ఉన్న ఐరన్‌నెట్‌ను డ్రిల్లింగ్ మిషన్‌తో కట్ చేసి తెరిచారు, అనంతరం ఉన్న తలుపు గడియ వద్ద డ్రిల్లింగ్ యంత్రంతో రెండు రంధ్రాలు వేసి తలుపులు తెరిచి ఇంటిలోకి ప్రవేశించారు. ఇంటిలో యారబాటి రమణమూర్తి కుమారుడు లక్ష్మీభరద్వాజ్ దంపతులు నిద్రిస్తున్న గదిలోకి ప్రవేశిస్తున్న క్రమంలో ఆ దంపతులకు మెలకువ రావడంతో ఎవర్రా మీరు అంటూ గట్టిగా కేకలు వేశారు. లక్ష్మీభరద్వాజ్ తండ్రి రమణమూర్తికి మెలకువ రావడంతో విద్యుత్ షాక్ వల్ల కేకలు వేసినట్లు భావించిన ఆయన పరుగెత్తుకుని వెళ్లి ఇంటి విద్యుత్ మెయిన్‌ను ఆపేశాడు. ఆ సమయంలో చెడ్డీగ్యాంగ్ చేతిలో ఉన్న వస్తువుతో విచక్షణారహితంగా లక్ష్మీభరధ్వాజ్‌ను కొట్టి బయటకు వెళ్లిపోయారు. దొంగల దాడిలో తలకు, చేతికి తీవ్రగాయాలు కావడంతో లక్ష్మీభరధ్వాజ్ విశాఖలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

**సంఘటనా స్థలాన్ని పరిశీలించిన విశాఖ సీపీ**

ఏపీఎస్‌పీ బెటాలియన్‌కు ఎదురుగా ఉన్న అయినాడ పంచాయతీలోని సత్యనారాయణపురం విశాఖ పరిధిలోకి వస్తుంది. చెడ్డీగ్యాంగ్ దాడి సమాచారం తెలుసుకున్న విశాఖ సీపీ రవిశంకర్ సంఘటన స్థలానికి చేరుకుని రమణమూర్తి ఇంటిని క్షుణ్ణంగా పరిశీలించారు.

### వ్యక్తి అదృశ్యం



అదృశ్యమైన లోలుగు కృష్ణ

సంతకవిటి: మండల పరిధిలోని చిత్తారిపురం గ్రామానికి చెందిన లోలుగు కృష్ణ(50)కు మతిస్థిమితం లేకపోవడంతో శనివారం ఇంటి నుంచి బయటకు వెళ్లి అదృశ్యమయ్యాడు. ఇప్పటివరకు ఇంటికి చేరకపోవడంతో కొడుకు లోలుగు నారాయణరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ శంకర్ తెలిపారు.

### నేడు, రేపు జాకేరు రామాలయం వార్షికోత్సవం

వేపాడ: మండలంలోని జాకేరు గ్రామంలో రామాలయం పదో వార్షికోత్సవాన్ని మంగళ, బుధవారాల్లో నిర్వహిస్తున్నట్లు గ్రామసర్పంచ్ బుద్దా చిన్నమ్మలు అప్పలనాయుడు దంపతులు తెలిపారు. గ్రామపెద్దలు, గ్రామస్తుల సహకారంతో నిర్వహిస్తున్న వార్షికోత్సవంలో భాగంగా మంగళవారం భైటో భజన, బుధవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు. సీతారాముల కల్యాణోత్సవం, అన్నసమారాధన, మహిళల కోలాటం సాయంత్రం ఎడ్లబళ్ల పరుగు ప్రదర్శన నిర్వహించనున్నట్లు చెప్పారు. ఎడ్ల పరుగు ప్రదర్శనలో విజేతలకు నగదు బహుమతులు అందచేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరుతున్నామన్నారు.

### 300 లీటర్ల సారా స్వాధీనం



పట్టుకున్న సారాను చూపిస్తున్న పోలీసులు

పాచిపెంట: ద్విచక్రవాహనంపై అక్రమంగా సారా తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై నారాయణరావు తెలిపారు. ఈ మేరకు రూరల్ సీఐ బాలకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ ద్విచక్రవాహనంపై సారా తరలిస్తున్న పాచిపెంట మండల కేంద్రానికి చెందిన యడ్ల సన్యాసిని పద్మాపురం జంక్షన్ వద్ద పట్టుకున్నామని చెప్పారు. అనంతరం 300లీటర్ల సారా, బైక్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించామన్నారు.

### రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని యువకుడి మృతి




మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే ఎస్సై రవివర్మ

కొత్తవలస: కొత్తవలస నుంచి విజయనగరం వెళ్లే రైల్వే లైన్‌లో కంటకాపల్లి రైల్వేస్టేషన్ దగ్గరలో రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని యువకుడు (24) మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు రైల్వే పోలీసులు సోమవారం సంఘటనా స్థలానికి వెళ్లి ఒడిశా నుంచి విశాఖ వెళ్తున్న రైలు నుంచి యువకుడు జారి పడినట్లు అనుమానిస్తున్నారు. ఈ మేరకు రైల్వే ఎస్సై రవివర్మ మాట్లాడుతూ మృతుడి శరీరంపై నీలం రంగు షార్టు, గళ్ల షర్టు ఉన్నట్లు తెలిపారు. మృతుడి కుడి మోచేతిపై ఓంకారం గుర్తును టాటూ వేసుకున్నట్లు గుర్తించామని, 5.5 అడుగుల ఎత్తు, చామనఛాయి రంగు కలిగి ఉన్నట్లు చెప్పారు. ఈ మేరకు శవ పంచనామా నిర్వహించి మృతదేహాన్ని విజయనగరం కేంద్రాస్పత్రికి తరలించారు.

### గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

విజయనగరం క్రైమ్: స్థానిక రిలయన్స్ మాల్ ఎదురుగా ఉన్న ఎగ్జిబిషన్ గ్రౌండ్ తుప్పల్లో చెట్టుకు ఉరివేసుకుని గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు సోమవారం తెలిపారు. మృతుడు సుమారు 40 నుంచి 45 ఏళ్ల వయసు కలిగి ఉంటాడని, విచారణ చేసినప్పటికీ ఎటువంటి వివరాలు తెలియకపోవడంతో మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రి మార్చురీలో భద్రపరిచినట్లు పేర్కొన్నారు. ఎస్సై హరిబాబునాయుడు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారని తెలిపారు. మృతుని బంధువులు ఎవరైనా గుర్తిస్తే వన్‌టౌన్ పోలీసులను సంప్రదించాలని కోరారు.

### ఉత్తరాంధ్ర స్థాయి ఏకపాత్రాభినయ పోటీల విజేత మహేష్



చిన్నారిని సత్కరిస్తున్న ఎస్‌వీఆర్ కళాపరిషత్ సభ్యులు

రాజాం సిటీ: పోలిపల్లి పైడితల్లి జాతర సందర్భంగా ఎస్‌వీఆర్ కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్తరాంధ్రస్థాయి ఏకపాత్రాభినయం పోటీల విజేతలను సోమవారం రాత్రి ప్రకటించారు. పోటీల్లో 13 మంది పాల్గొని పోటాపోటీగా ప్రదర్శనలు కనబరిచారు. వీరిలో వంగర మండలం కొప్పరవలసకు చెందిన వందాన మహేష్ హరిశ్చంద్ర నాటకంలోని అరణ్యసీను ఏకపాత్రాభినయానికి ప్రథమ స్థానం దక్కింది. పార్వతీపురానికి చెందిన పట్నాల నరసింహాచారి బృందం కాటిసీనుకు ద్వితీయ స్థానం, బత్తెముల సీనుకు సంబంధించి పార్వతీపురానికి చెందిన ఇట్లా సూర్యనారాయణ బృందం తృతీయస్థానం దక్కించుకుంది. వీరికి నగదు బహుమతులతోపాటు షీల్డ్‌లు అందజేశారు. అనంతరం రా.ర.వే అధ్యక్షుడు గార రంగనాథం, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.స్వప్నహైందవిలతోపాటు పలువురిని సత్కరించారు.

అంతకు ముందు కూచిపూడి నృత్యంతో ఆహుతులను అలరించిన చిన్నారిని సత్కరించారు. కార్యక్రమంలో ఎస్‌వీఆర్ కళాపరిసత్ అధ్యక్షుడు సలాది తులసీదాస్, ఆర్నిపల్లి వెంకటినాయుడు, పద్మశ్రీ యడ్ల గోపాలరావు, ఎస్.సత్యనారాయణ, సలాది మహేష్, పెంకి చైతన్యకుమార్, తదితరులు పాల్గొన్నారు.

### సీతంపేట డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా సుశాంత్‌కుమార్‌జెన్నా



ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒడియా అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్న సుశాంత్‌కుమార్ జెన్నా సీతంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా పదోన్నతిపొందారు. కళాశాల ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సుశాంత్‌కుమార్‌జెన్నాను సిబ్బంది అభినందించారు.